సాక్షి
గుంటూరు
శనివారం, 28, అక్టోబర్, 2023



**బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ**
నరసరావుపేట: జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో డిసెంబర్ 8, 9 తేదీలలో నిర్వహించే పల్నాడు బాలోత్సవం పోస్టర్‌ను కలెక్టర్ శివశంకర్ శుక్రవారం ఆవిష్కరించారు.



**వైద్య విద్యార్థులకు అభినందన**
గుంటూరు మెడికల్: ఇంటర్ కాలేజ్ గేమ్స్‌లో సత్తాచాటిన గుంటూరు వైద్య కళాశాల విద్యార్థులను శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి అభినందించారు.



**కొనసాగుతున్న భవానీల రద్దీ**
విజయవాడ : ఇంద్రకీలాద్రిపై భవానీల రద్దీ కొనసాగుతోంది. దూర ప్రాంతాల నుంచి వస్తున్న భవానీలు పుణ్యస్నానాలు ఆచరించి, భక్తితో దీక్షల విరమణ చేస్తున్నారు.

## న్యూస్‌రీల్

### నేడు అమరేశ్వరాలయం మూసివేత

**అమరావతి:** చంద్రగ్రహణం నేపథ్యంలో ఈనెల 28న శనివారం రాత్రి 7 గంటలకు అమరేశ్వరాలయాన్ని మూసివేస్తామని ఈఓ వేమూరి గోపినాథశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాక్షిక చంద్రగ్రహణం కారణంగా ఆలయాన్ని శనివారం 6.30 గంటలకు స్వామి ఏకాంతసేవలు ముగిసిన అనంతరం 7 గంటలకు మూసివేస్తామని పేర్కొన్నారు. పాక్షిక చంద్ర గ్రహణానికి పట్టు, విడుపు కాలాలను కలుపుకుని ఈనెల 29న ఉదయం దేవాలయం తెరిచి స్వామి వారికి తిరువంజన సేవ, సంప్రోక్షణ ప్రత్యేక పూజల అనంతరం 9.30 గంటలకు భక్తులకు దర్శనం కల్పిస్తామని వివరించారు.

### నేడు సీనియర్ ఉమెన్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

**గుంటూరు వెస్ట్ ( క్రీడలు) :** జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4 గంటలకు స్థానిక బీఆర్ స్టేడియంలో సీనియర్ ఉమెన్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షులు కుమ్మరి క్రాంతి కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ ఆధారంగా జిల్లా జట్టును ఎంపిక చేసి వచ్చేనెల 2, 3 తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న అంతర్ రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 96429 31771ను సంప్రదించాలన్నారు.

### ముగ్గురికి ఏవోలుగా పదోన్నతి

**గుంటూరు మెడికల్ :** ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త కార్యాలయ పరిధిలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ముగ్గురికి శుక్రవారం పరిపాలన అధికారులుగా పదోన్నతి లభించింది. వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్ ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. బాపట్ల ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న మాణిక్యారావుకు అక్కడే ఏఓగా ప్రమోషన్ ఇచ్చారు. సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న మెహరున్నీసాకు ఏవోగా ప్రమోషన్ ఇచ్చి చిలకలూరిపేట బదిలీ చేశారు. చిలకలూరిపేటలో పనిచేస్తున్న విజయలక్ష్మికి ఏఓగా ప్రమోషన్ ఇచ్చి చీరాల బదిలీ చేశారు.

### 153 బస్సులపై కేసులు నమోదు

**గుంటూరు ఈస్ట్ :** దసరా పండగ సందర్భంగా కాంట్రాక్టు క్యారేజీ బస్సులపై చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన 153 బస్సులపై కేసు నమోదు చేసినట్లు ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ శుక్రవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మోటారు వాహన తనిఖీ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారన్నారు. ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక తనిఖీలు చేపట్టగా, కాజ టోల్‌ప్లాజా, పేరేచర్ల జంక్షన్‌ల వద్ద 153 బస్సులు నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్నట్లు గుర్తించి ఆ బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు.

### ఏకోనాంపేటలో కార్డన్ సెర్చ్




**విజయపురిసౌత్:** తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మాచర్ల మండలంలోని ఆంధ్రప్రదేశ్ బోర్డర్ గ్రామమైన ఏకోనాంపేటలో శుక్రవారం రాత్రి మాచర్ల రూరల్ సీఐ ఎస్‌కె సమీముల్లా ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు అక్రమ మద్యం, నగదు ఇతర వస్తువులు రాకుండా కార్డన్‌సెర్చ్ చేపట్టారు. నాగార్జున సాగర్ బోర్డర్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల రూరల్ ఎస్ఐ కె రాజశేఖర్, సాగర్ ఏఎస్ఐ ఎస్‌కె మస్తాన్‌వలి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### సాగునీటి సమాచారం

**తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) :** కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 4,227 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 212, బ్యాంక్ కెనాల్‌కు 1,102, తూర్పు కెనాల్‌కు 630, పశ్చిమ కెనాల్‌కు 165, నిజాంపట్నం కాలువకు 338, కొమ్మమూరు కాల్వకు 1,217 క్యూసెక్కులు వదిలారు.

### సాగర్ నీటిమట్టం



**విజయపురిసౌత్:** నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 525.20 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 23,765, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 845.30 అడుగుల వద్ద ఉంది.

# బైక్ రేసింగ్‌లు జరిగితే వేటే



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ పాలరాజు చిత్రంలో ఏఎస్పీలు



సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు

- రాత్రి 11 గంటలకు బార్లు మూయించాలి
- అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపాలి
- ఎన్నికలు సమీపిస్తున్నందున రౌడీషీటర్ల బైండోవర్‌పై దృష్టి పెట్టండి
- మాట వినకుంటే అధికారులపై వేటు తప్పదు
- సమీక్షలో ఐజీ పాలరాజు హెచ్చరిక

**సాక్షి ప్రతినిధి, గుంటూరు:** గుంటూరు నగరంలో బైక్ రేసింగ్‌లు జరిగితే ఆయా స్టేషన్ అధికారులపై వేటు వేస్తామని గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు హెచ్చరించారు. శుక్రవారం ఆయన జిల్లాలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, డీఎస్పీలు, అదనపు ఎస్పీలతో సమీక్ష నిర్వహించారు. గుంటూరు జిల్లాలో జరుగుతున్న బైక్ రేసింగ్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బైక్ రేసింగ్‌లు జరిగే ప్రాంతాలపై పూర్తి నిఘా పెట్టాలని ఆదేశించారు. గురువారం పట్టాభిపురంలో బార్ వద్ద జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి మృతి చెందడంపైనా ఐజీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. రాత్రి 11 గంటలకల్లా బార్లు మూయించాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారిపై కేసులు పెంచాలని ఆదేశాలు జారీ చేశారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచాలన్నారు. బీట్లు సక్రమంగా వేయడంతోపాటు విజిబుల్ పోలీసింగ్ జరిగేలా చూడాలన్నారు. బీట్ కానిస్టేబుళ్ల వద్ద విజిల్స్, లాఠీ, టార్చ్‌లైట్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

**ఆర్మ్‌డ్ పోలీసులూ గస్తీ తిరగాలి**

బీట్ కానిస్టేబుళ్లతోపాటు ఆర్మ్‌డ్ పోలీసులు గస్తీ తిరగాలని, రాత్రి 12 గంటల తర్వాత రోడ్లపైకి వచ్చేవారిని ప్రశ్నించడంతోపాటు వారి ఫోన్ నంబర్, బైక్‌నెంబర్లను నమోదు చేసి కంట్రోల్ రూమ్‌కు పంపాలన్నారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించాలని ఆదేశించారు. గుంటూరు నగరంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రౌడీషీటర్లపై నిఘా పెంచాలని, ఆదివారంతోపాటు మిగిలిన రోజుల్లోనూ వారిని స్టేషన్‌కు పిలవడంతోపాటు వారి కదలికపై నిఘా ఉంచాలన్నారు. శిక్ష పడిన కేసుల్లో ముద్దాయిలపై షీట్లు ఓపెన్ చేయాలని, ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో అసాంఘిక శక్తుల కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని కోరారు.

**ఫిర్యాదుదారులతో గౌరవంగా మెలగాలి**

స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా మెలగాలని ఐజీ పాలరాజు సూచించారు. స్టేషన్లలో రిసెప్షన్ సెంటర్లను తీర్చిదిద్దాలని సూచించారు. కేసు నమోదు చేయడమే కాకుండా పరిష్కరించడంపైనా దృష్టి పెట్టాలని, ఈ విషయంలో గుంటూరు పోలీసులు రేంజ్‌లోనే వెనుకబడి ఉన్నారని ఐజీ అసహనం వ్యక్తం చేశారు. కేసులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు.

## కుడి జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలించిన ఏపీజెన్‌కో సీఈ



ఏపీజెన్‌కో సీఈ కాంతారావును సన్మానిస్తున్న సాగర్ కుడిజలవిద్యుత్ కేంద్రం ఈఈ ప్రసాద్, ఉద్యోగులు

**విజయపురిసౌత్:** ఏపీ జెన్‌కో శ్రీశైలం కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్ డీవీఎస్ఎస్ఎల్ కాంతారావు శుక్రవారం నాగార్జున సాగర్ కుడి జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలించారు. ముందుగా జలవిద్యుత్ కేంద్రంలో జరుగుతున్న పెన్ స్టాక్ సర్వీస్ మొదటి యూనిట్ గేట్ మరమ్మతు పనులను పరిశీలించారు. పెన్ స్టాక్ గేట్ పనులను నవంబర్ 10లోపు పూర్తి చేయాలని ఈఈ వైఎస్ఆర్‌కే ప్రసాద్‌తో చెప్పారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఈఈ 327 యూనియన్ ఆధ్వర్యంలో సీఈ కాంతారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఈ రాజారెడ్డి, యూనియన్ అధ్యక్షుడు ఎం.సాంబశివరావు, కార్యదర్శి బి.సూరజ్‌చంద్ పాల్గొన్నారు.

# గుంటూరు జిల్లా ఓటర్లు 17,37,447 మంది

- ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల
- డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తాం
- కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి



ముసాయిదా ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

**గుంటూరు వెస్ట్:** ముసాయిదా ఓటర్ల జాబితాను కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు మందిరంలో అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 17,37,447 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఓటర్ల జాబితాపై డిసెంబర్ 9 వరకు క్లెయిమ్స్ స్వీకరిస్తామని పేర్కొన్నారు. నవంబర్ 4, 5 తేదీలతోపాటు డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అభ్యంతరాలు, క్లెయిమ్స్‌ను స్వీకరిస్తామన్నారు. రాజకీయ పార్టీలు అభ్యంతరాలను ఈఆర్వోలకు అందజేయాలన్నారు. ప్రజలు కూడా ముసాయిదా జాబితాలో తమ పేర్లను సరిచూసుకోవాలన్నారు. జిల్లాలోని 7 నియోజకవర్గాల ప్రతినిధులకు ముసాయిదాకు సంబంధించిన సీడీలను కలెక్టర్ అందజేశారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్ సుజాత, గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సామాజిక జయభేరి

- నేడు బాపట్లలో వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర
- పిట్టలవానిపాలెం మండలం నంగుపాలెం నుంచి ప్రారంభం
- పార్టీ శ్రేణుల్లో ఉరకలెత్తుతున్న ఉత్సాహం



**సాధికార యాత్రతో జోష్..**

**సాక్షి ప్రతినిధి, బాపట్ల:** వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర శనివారం బాపట్ల నియోజకవర్గంలో జరగనుంది. ఉదయం 11 గంటలకు పిట్టలవానిపాలెం మండలం సంగుపాలెంలో యాత్ర ప్రారంభం కానుంది. అక్కడి నుంచి కర్లపాలెం మండలం మీదుగా బాపట్ల రూరల్, టౌన్ ప్రాంతాల్లో యాత్ర సాగనుంది. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బహిరంగసభ నిర్వహించనున్నారు. యాత్రలో భాగంగా దేవాలయాలు, మసీదులు, చర్చిలతోపాటు మనబడి నాడు-నేడులో భాగంగా అభివృద్ధి చేసిన పాఠశాలలను ప్రజాప్రతినిధులు సందర్శిస్తారు. వీటితోపాటు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను నేతల బృందం పరిశీలించనుంది. పలుచోట్ల వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించనుంది. గ్రామాల్లో బైక్‌ర్యాలీలు, పాదయాత్రలు జరగనున్నాయి. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో యాత్ర సాగనుంది. యాత్రలో రాజ్యసభ సభ్యులు, పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేష్, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు పలువురు ప్రముఖ నేతలు పాల్గొననున్నారు.

సామాజిక సాధికారత యాత్రతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం ఉరకలెత్తుతోంది. యాత్రకు గ్రామాల్లో స్వాగతం పలికేందుకు కార్యకర్తలు సంసిద్ధులవుతున్నారు. వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కుల,మతాలకతీతంగా అర్హులైన అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలను అందజేస్తోంది. దీంతోపాటు అన్ని సామాజికవర్గాలకూ రాజకీయంగా ప్రాధాన్యమిచ్చింది. ఎదుగుదలకు విశేష కృషి చేస్తోంది. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభ్యున్నతికి పాటుపడుతోంది. దీనివల్ల సామాజిక సాధికారత సాధ్యమవుతోంది. ఫలితంగా జగన్ పాలనలో అన్నివర్గాలవారూ సంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో చేసిన మంచిని ప్రజలకు వివరించేందుకు వైఎస్సార్ సీపీ సామాజిక సాధికారత పేరుతో బస్సుయాత్ర నిర్వహిస్తోంది. ఇతర జిల్లాల్లో ఇప్పటికే ప్రారంభమైన ఈ యాత్రకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభిస్తోంది. జనం స్వచ్ఛందంగా తరలివస్తున్నారు. విజయసాయిరెడ్డి రీజినల్ కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టాక బాపట్లలో నియోజకవర్గాలవారీ సమావేశాలు నిర్వహించారు. దీంతో పార్టీశ్రేణుల్లో నయా జోష్ నెలకొంది. తాజాగా బస్సు యాత్రతో ఈ ఉత్సాహం రెట్టింపయింది. ఫలితంగా కార్యకర్తలు, నేతలు జయభేరి మోగించనున్నారు.

**బస్సు యాత్ర సాగుతుందిలా..**

- శనివారం ఉదయం 11.45 గంటల నుంచి 11.55 గంటల వరకు పిట్టలవానిపాలెం మండలం, సంగుపాలెంలో మహానేతల విగ్రహాల వద్ద నివాళి
- 12 గంటల నుంచి 12.20 గంటల వరకు చందోలులోని బగళాముఖి ఆలయం సందర్శన
- 12.30 గంటల నుంచి ఒంటి గంట వరకు పెద్దమసీదు సందర్శన
- 1.05 గంటల నుంచి 2.45 గంటల వరకు చందోలులో జెడ్పీహైస్కూల్‌లో మనబడి నాడు-నేడు పనుల పరిశీలన, భోజన విరామం, ప్రెస్‌మీట్
- 2.45 గంటల నుంచి 3.45 గంటల వరకు చందోలు నుంచి బుద్ధాం మీదుగా కర్లపాలెం వరకు యాత్ర. కర్లపాలెం ఐలాండ్ సెంటర్‌లో సభ
- 3.45 గంటల నుంచి 4.30 గంటల వరకు కర్లపాలెం నుంచి నందిరాజుతోట మీదుగా బాపట్ల టౌన్ వరకు బైక్‌ర్యాలీ, బస్సుయాత్ర
- 4.30 గంటల నుంచి 5.15 గంటల వరకు పట్టణంలోని ప్యాడిసెన్ పేట నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు పాదయాత్ర, ఏబీఎం సెర్చ్ పరిశీలన, ఆటో, ట్యాక్సీ డ్రైవర్లతో మాటామంతి
- 5.15 గంటల నుంచి 6.45 గంటల వరకు బాపట్ల అంబేడ్కర్ సర్కిల్‌లో బహిరంగ సభ

## జగనన్న పాలనలో సామాజిక న్యాయం

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- వడ్లమూడిలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అవగాహన కార్యక్రమం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పక్కన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్

**చేబ్రోలు:** సామాజిక న్యాయాన్ని, ధర్మాన్ని పాటించి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలోని కృష్ణా గార్డెన్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంపై శుక్రవారం అవగాహనా కార్యక్రమం జరిగింది. సమావేశానికి పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య అధ్యక్షత వహించారు. పొన్నూరు నియోజకవర్గంలోని పెదకాకాని, చేబ్రోలు, పొన్నూరు పట్టణ, రూరల్ మండలాల నుంచి పార్టీ ముఖ్య నేతలు, గృహసారథులు, కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీ అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేయాలన్నారు.

ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లి చేపట్టిన అభివృద్ధి పనులను కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులు వివరించాలన్నారు. సామాజిక సాధికారక బస్సు యాత్రను విజయవంతం చేయాలన్నారు. పొన్నూరు నియోజకవర్గం సత్తాను ప్రదర్శించాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మ్యానిఫెస్టోను బైబిల్, భగవద్గీత, ఖురాన్‌లా భావించి వాటిని తూచా తప్పకుండా అమలు చేసినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలను పారదర్శకంగా అర్హతే ప్రామాణికంగా అందిస్తున్నట్లు తెలిపారు. పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గంలో రూ.1,600 కోట్లు సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. కోటి 50 లక్షల మందికి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించినట్లు వివరించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు దిక్సూచీగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ బోర్డు చైర్మన్ మందపాటి శేషగిరిరావు, నియోజకవర్గ పరిశీలకులు అన్నాబత్తుని సదాశివరావు, అంజిరెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనూరాధ, నాయకులు గోళ్ల జ్యోతి, కొక్కిలగడ్డ సాహితి, తుల్లిమిల్లి శ్రీనివాసరావు, పి.కృష్ణమోహన్, కుర్రా పాములు, మాదా రాధా, దాసరి నారాయణరావు, షేక్ సైపుల్లా, ఆకుల వెంకటేశ్వరావు, భవనం వంశీరెడ్డి, సయ్యద్ సుభాని, కఠారి వెంకట రమణ, పెదమస్తాన్, చాగంటి మురళీమోహన్, కోట శ్రీనివాసరావు, అల్లాభక్షు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డొక్కా మాణిక్య వరప్రసాద్

# చీరస్మరణీయం

- మంగళగిరి చేనేత చీరకు జాతీయస్థాయి గుర్తింపు
- ఒక జిల్లా- ఒక ఉత్పత్తి అవార్డుకు కేంద్ర బృందం పరిశీలన
- తుది దశలో ఎంపిక ప్రక్రియ



చేనేత భవన నిర్మాణ పనులపై సూచనలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు(ఫైల్)

**మంగళగిరి:** మంగళగిరి చేనేత చీరలకు చారిత్రాత్మక గుర్తింపు లభించనుంది. కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రతి జిల్లా నుంచి ఒక ఉత్పత్తిని గుర్తించి ప్రోత్సహించాలనే లక్ష్యంతో చేపట్టిన ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి (ఓడీఓపీ) జాతీయ అవార్డుల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఓడీఓపీలో భాగంగా జాతీయ అవార్డు-2023కు అన్ని రాష్ట్రాల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అందులో భాగంగా రాష్ట్రం నుంచి 13 ఉత్పత్తులకు చోటు లభించగా గుంటూరు జిల్లా నుంచి మంగళగిరి చేనేత చీరకు అవకాశం దక్కింది. ఇన్వెస్ట్ ఇండియా బృందం (జాతీయ స్థాయి టీమ్) సభ్యురాలు ఆరాధన శర్మ నేతృత్వంలో ఇటీవల పర్యటించి క్షేత్రస్థాయిలో చేనేత చీర తయారీని పరిశీలించారు. వివరాలను సేకరించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సారథ్యంలో మంగళగిరిలో కొత్తగా 3.60 కోట్లతో రాజీవ్ గృహ కల్ప వద్ద నిర్మించిన మగ్గం షెడ్లను, రూ.4 కోట్లతో పాతబస్టాండ్ ఆవరణలో నిర్మించిన ప్రగడ కోటయ్య-వైఎస్సార్ చేనేత భవనాలతోపాటు పట్టణంలోని చేనేత వస్త్ర దుకాణాలలో కేంద్ర బృందం పర్యటించింది. చేనేత చీరలు అవార్డుకు ఎంపికైతే మంచి మార్కెటింగ్ లభించడంతోపాటు పరిశ్రమకు పెట్టుబడులు పెరిగే అవకాశముంది.

**ఆనందంగా ఉంది**



మంగళగిరి చేనేత చీరలు జాతీయ అవార్డు పరిశీలనకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. మంగళగిరిలో చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తోంది. మగ్గం షెడ్లు, మార్కెటింగ్‌కు చేనేత భవనం నిర్మిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత పరిశ్రమతోపాటు కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు వైఎస్సార్ నేతన్న నేస్తం దిగ్విజయంగా అమలు చేస్తున్నారు. రానున్న రోజులలో అంతర్జాతీయ స్థాయిలో చేనేత పరిశ్రమకు గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తాం.

– ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్యే, మంగళగిరి

**మార్కెటింగ్ అవకాశాలు పెరుగుతాయి**



మంగళగిరి చేనేత చీరలను జాతీయ అవార్డు ఎంపికకు పరిశీలించడం చాలా సంతోషంగా ఉంది. జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తే చీరలకు మరింత డిమాండ్ దక్కుతుంది. మార్కెటింగ్ అవకాశాలు పెరుగుతాయి. కార్మికుల ఆదాయం పెరుగుతుంది. మంగళగిరిలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి ఎమ్మెల్యే ఆర్కే ఎంతో కృషి చేస్తున్నారు.

– అవ్వారు సుబ్బారావు, చేనేత వస్త్ర ఉత్పత్తిదారుడు

## మల్లేశ్వరుని హుండీల ఆదాయం లెక్కింపు



**పెదకాకాని:** శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆదాయం గణనీయంగా పెరిగిందని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి చెప్పారు. పెదకాకాని శివాలయంలో శుక్రవారం హుండీలను తెరిచి కానుకలు లెక్కించారు. ఉదయం 9 గంటలకు ఆలయంలోని 16 హుండీలను తెరిచి లెక్కింపు ప్రారంభించారు. ఈ లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు పొన్నూరు శ్రీ భావన్నారాయణస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆర్.రమణమ్మ విచ్చేశారు. నాలుగు నెలలకు హుండీల్లోని కానుకల లెక్కింపు ద్వారా స్వామికి 60,70,363 రూపాయల నగదు, బంగారం 17 గ్రాములు, వెండి 1.030 గ్రాములు, అమెరికన్ డాలర్లు 12, నేపాల్ రూపాయలు 15 లభించినట్లు ఏసీ ఎన్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని పాలకవర్గం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకవర్గం సభ్యులు పర్యవేక్షించారు. గత ఏడాది కన్నా 15 లక్షల రూపాయలు ఆదాయం అదనంగా స్వామికి సమకూరినట్లు ఏసీ వెల్లడించారు.

## క్లుప్తంగా

### దూరవిద్యతో విద్యావంతులుగా ఎదగాలి

**ఏపీఓఎస్ఎస్ డెప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు**



**గుంటూరు ఎడ్యుకేషన్:** సమాజంలో నిరక్షరాస్యతను రూపుమాపేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న దూరవిద్యా విధానం ద్వారా ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా ఎదగాలని ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ(ఏపీ ఓఎస్ఎస్) డెప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను సందర్శించిన వెంకటేశ్వరరావు పాఠశాల లోని ఏపీఓఎస్ఎస్ అధ్యయన కేంద్రం ద్వారా దూరవిద్య టెన్త్, ఇంటర్ ప్రవేశాల ప్రగతిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దూరవిద్య టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ఎటువంటి అపరాధ రుసుం లేకుండా చేరేందుకు ఈనెల 30వ తేదీ వరకు అవకాశ ముందని చెప్పారు. టెన్త్‌లో తప్పిన విద్యార్థులు దూరవిద్య టెన్త్‌లో చేరి పదో తరగతి పూర్తి చేసేందుకు అవకాశముందని, ప్రభుత్వమిచ్చే సర్టిఫికెట్ రెగ్యులర్ టెన్త్‌తో సమానమని అన్నారు. జిల్లాలోని అన్ని అధ్యయన కేంద్రాల కో-ఆర్డినేటర్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ విషయమై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం బి.విజయలక్ష్మి, ఓపెన్ స్కూల్ ప్రతినిధి శ్రీధర్ ఉన్నారు.

### సౌత్‌జోన్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

**చీరాల టౌన్:** సౌత్‌జోన్ పోటీల్లో చీరాల విద్యార్థిని ప్రతిభ చూపి మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ పోటీలు అక్టోబర్ 15 నుంచి 17 వరకు తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా హన్మకొండలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగాయి. పోటీల్లో చీరాల చైతన్య భారతీ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మొదటి ఏడాది చదువుతున్న పాలవలస మహాలక్ష్మి ప్రతిభ చూపి కాంస్య పతకాన్ని సాధించింది. శుక్రవారం కళాశాలలో జరిగిన అభినందన సభలో కళాశాల యాజమాన్యం కాంస్య పతకం సాధించిన మహాలక్ష్మిని అభినందించి సత్కరించింది. కళాశాల యాజమాన్యం రాంబాబు, సురేష్, ఉస్మాన్, ప్రిన్సిపాల్ సోమేశ్వరరావులు మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల పరిధిలో హన్మకొండలో నిర్వహించిన సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో తమ విద్యార్థిని మహాలక్ష్మి 4-400 రిలే పోటీల్లో ప్రతిభచూపి కాంస్య పతకం సాధించడం గర్వకారణమన్నారు.

# లడ్డూ విక్రయాల్లో రికార్డు

**ఈ ఏడాది 25 లక్షలకు పైగా కొనుగోలు చేసిన భక్తులు**

- గత మూడేళ్లలో ఇదే అత్యధికం
- 15 రోజులపాటు నిరంతరం పనిచేసిన సిబ్బంది
- భవానీలు, భక్తులకు ఎక్కడా తక్కువ కాకుండా సరఫరా
- 24 గంటలూ పనిచేసిన లడ్డూ కౌంటర్లు



లడ్డూలను ప్యాకింగ్ చేస్తున్న కార్మికులు

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై నిర్వహించిన దసరా ఉత్సవాల, ఆ తర్వాత మూడు రోజులలో మొత్తం 25 లక్షలకు పైగా లడ్డూల విక్రయాలు జరిగాయి. గడిచిన మూడేళ్లలో ఇదే రికార్డు అని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. గత ఏడాది ఉత్సవాలు ఆ తర్వాత భవానీల రద్దీ మొత్తం కలిపి 24.48 లక్షల లడ్డూలను విక్రయిస్తూ, 2021 దసరా ఉత్సవాల్లో 15.79 లక్షల లడ్డూలను మాత్రమే విక్రయాలు జరిగాయి. దసరా ఉత్సవాల ప్రారంభం నుంచే ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, చైర్మన్ కర్నాటి రాంబాబు, దుర్గగుడి ఈవో కేఎస్ రామారావులు లడ్డూ తయారీపై నిరంతరం పర్యవేక్షిస్తూ, లడ్డూ ప్రసాదాల నాణ్యతను పరిశీలించారు.

ఇక భక్తులు కోరినన్ని లడ్డూలను ఇవ్వాలనే సంకల్పంతో అధికారులందరూ కలిసి పనిచేయడంతో ఎటువంటి ఫిర్యాదులు లేకుండా లడ్డూలను తయారు చేసి భక్తులకు అందజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది దసరా ఉత్సవాలు ముగిసిన తర్వాత కూడా లడ్డూ కౌంటర్లు 24 గంటలు పని చేసి భక్తులకు, భవానీలకు లడ్డూలను అందజేశారు.

**పక్షం రోజులు.. 24 గంటలు తయారీ**

దసరా ఉత్సవాలలో భక్తుల డిమాండ్‌కు తగినట్లుగా లడ్డూలను తయారు చేసి అందించడంలో ఎంతో మంది కార్మికుల శ్రమ దాగి ఉంది. ఉత్సవాలకు రెండు రోజుల ముందు నుంచే లడ్డూలను తయారు చేసి నిల్వ చేశారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలు అక్టోబర్ 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరిగాయి. 12వ తేదీ నుంచి 26వ తేదీ వరకు లడ్డూ తయారీ కొనసాగింది. సుమారు 300 మంది కాంట్రాక్టు కార్మికులు నిరంతరం 24 గంటలు లడ్డూ తయారీ చేపట్టారు. లడ్డూలను తయారు చేయడం ఒక ఎత్తయితే వాటిని అడ్డంకులన్నీ దాటుకుని కౌంటర్లకు చేరవేయడం కష్టతరం. లడ్డూలను కౌంటర్లకు చేరవేసేందుకు అదనంగా సూపర్‌వైజర్లను



లడ్డూ తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు (ఫైల్)

నియమించారు. లడ్డూ తయారీ చేసి భక్తులకు అందజేయడంలో ఏఈవో ఎన్. రమేష్‌బాబుతో పాటు సూపరింటెంటెంట్ కె.శ్రీనివాసరావు, లక్ష్మణ స్వామి, ఏకేడీ శివకుమార్ పర్యవేక్షించారు. సుమారు 15 రోజుల పాటు లడ్డూ తయారీ ప్రస్థానం కొనసాగింది.

**ఉత్సవాలకు 20 లక్షల అంచనా**

దసరా ఉత్సవాలలో భక్తులు కోరినట్లు లడ్డూలను ఇవ్వాలనే భావనతో దేవస్థానం 20 లక్షల లడ్డూల తయారీకి అంచనాలను సిద్ధం చేసింది. అయితే ఉత్సవాలలో తొలి రోజులు లడ్డూ విక్రయాలు నామ మాత్రంగానే జరిగాయి. దసరా ఉత్సవాలలో అత్యంత కీలకమైన మూలా నక్షత్రం రోజు నుంచి లడ్డూ విక్రయాలు భారీగా పెరిగాయి. 15వ తేదీన ఉత్సవాలు ప్రారంభం రోజున 67,966 లడ్డూలను విక్రయిస్తే, మూలా నక్షత్రం రోజున 1.80 లక్షల లడ్డూలను, 22వ తేదీ, 23వ తేదీలలో సుమారు 7 లక్షలకు పైగా లడ్డూలను విక్రయించారు.

# మంత్రి అంబటిపై దాడికి నిరసనగా కాపు సంఘాల ఆందోళన

- దాడిచేయడం సరైనది కాదు
- గోరంట్లలో నిరసన
- నిందితులను శిక్షించాలంటూ డిమాండ్

**గుంటూరు రూరల్:** రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుపై ఖమ్మంలో జనసైకోల దాడిని ఖండిస్తూ గోరంట్లలో వంగవీటి రంగా విగ్రహం వద్ద కాపు సామాజిక వర్గం, కాపు సంఘాల నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం రాస్తారోకో చేశారు. కాపు సంఘం నాయకుడు చిల్లర భవానికిషోర్ మాట్లాడుతూ కాపు సామాజిక వర్గానికి చెందిన జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును గతంలో టీడీపీ హయాంలో మేడికొండూరులో అడ్డుకొని దాడి చేశారన్నారు. నేడు రాష్ట్ర మంత్రిగా ఉన్న అంబటి రాంబాబుపై ఖమ్మం జిల్లాలో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు



ఆందోళన చేస్తున్న కాపు నాయకులు

దాడి చేయడం సరైనది కాదని హితవు పలికారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ కాపులపై చేస్తు న్న దాడిని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాపు నాయకులు జల్లేపల్లి వేణుబాబు, రామిశెట్టి కోటేశ్వరరావు, అంకం సత్యం, గోరంట్ల కాపు సామాజిక వర్గ నాయకులు, రంగా విగ్రహ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**గుంటూరు రూరల్:** రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుపై దాడిచేసిన వారిని అరెస్ట్ చేసి వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేయాలని గుంటూరు మిర్చి యార్డు డైరెక్టర్ బందలపాటి వెంకటేశ్వర్లు(ఇంద్ర) డిమాండ్ చేశారు. శుక్రవారం నగర శివారుల్లోని అమరావతి రోడ్డు ఇన్నర్ రింగ్‌రోడ్డులోని చిల్లీస్ సెంటర్‌లో వంగవీటి మోహ న రంగా విగ్రహం వద్ద నిరసన ఆందోళన చేశారు. మంత్రిపై టీడీపీ, జనసేన నాయకులు దాడిని వైఎస్సార్ సీపీ, కాపు సంఘాల నాయకులు ఖండిస్తున్నామన్నారు.

# దరఖాస్తుదారులు సంతృప్తి చెందేలా పరిష్కారమవ్వాలి

- జగనన్నకు చెబుదాం అర్జీలపై జేసీ రాజకుమారి ఆదేశం
- చేబ్రోలులో అర్జీల స్వీకారం



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

**చేబ్రోలు:** జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన అర్జీలను దరఖాస్తుదారులు సంతృప్తి చెందేలా మెరుగైన పరిష్కారం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని గ్రామ సచివాలయంలో శుక్రవారం జగన్నన్నకు చెబుదాం కార్యక్రమం జరిగింది. జిల్లాలో మండల స్థాయిలో జరుగుతున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్ని శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండల పరిధిలోని 13 గ్రామాల పరిధిలో ప్రజల నుంచి వ్యక్తిగత సమస్యలు, సామాజిక మౌలిక సౌకర్యాల కల్పన, అభివృద్ధికి సంబంధించి 45 అర్జీలు అందాయి. అర్జీలను పరిశీలించి పరిష్కార దిశగా ప్రణాళికా ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బకింగ్ హాం కెనాల్, సాగునీటి కాలువల్లో తూడి కాడ, పూడిక వల్ల సాగునీరు సక్రమంగా ప్రవహించటం లేదని కెనాల్‌ను అభివృద్ధి చేయాలని అర్జీ అందించారు. సాగునీరు పొలాలకు సక్రమంగా అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఎస్ఈను జేసీ ఆదేశించారు. పాతరెడ్డిపాలెంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి అందించాలని పంచాయతీరాజ్ ఎస్ఈకి జేసీ ఆదేశించారు. గొడవర్రు గ్రామంలో మంచినీటి చెరువులో పూడిక పేరుకుపోయిందని, శుభ్రం చేయాలని అర్జీ అందించడంతో ఆర్‌డబ్ల్యూస్ అధికారులు చెరువును పరిశీలించి శుభ్రం చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవలకు సంబంధించి సాంకేతిక కారణాలతో ఉత్పన్నమైన సమస్యలపై అర్జీలు అందటంతో వాటిని మండల, సచివాలయ ఉద్యోగులు సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సెప్ట్‌సీఈవో పల్లవి, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, పశుసంవర్ధకశాఖ జేడీ వెంకటేశ్వర్లు, సీపీఓ శేషశ్రీ, బీసీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి, ఉద్యానవనశాఖ ఏడీ రవీంద్రబాబు, పంచాయతీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ జయరామకృష్ణ, స్థానిక తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో బి బాబురావు, గ్రామ సర్పంచ్ వినీతారాణి పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాలను నివారించండి

**కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి**

**గుంటూరు వెస్ట్:** జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు ద్విచక్ర వాహనాలు, ఆటోలు సర్వీస్ రోడ్లలోనే ప్రయాణించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పైన తెలిపిన వాహనాల కారణంగా ప్రమాదాల సంఖ్య అధికంగా ఉంటోందన్నారు. దీనిపై పోలీసు, రవాణా శాఖ సంయుక్తంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జాతీయ రహదారిపై చెత్తాచెదారం వేయడం, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడడం చేయాలన్నారు. తెనాలి-నారాకోడూరు రహదారి మధ్యలోని బ్లాక్ స్పాట్‌ల వద్ద అవసరమైన పనులను ప్రారంభించాలన్నారు. జిల్లాలోని రహదారి ప్రమాదాలను ఎప్పటికప్పుడు ఐఆర్‌డీఏ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఉప రవాణా శాఖ కమిషనర్ ఎస్‌కె కరీం, డీఆర్వో చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్ సుజాత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు: కలెక్టర్**

స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన పీసీపీ ఎన్‌డీటీ చట్టంపై జిల్లాస్థాయి సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్కానింగ్ సెంటర్లపై ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించాలని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు మాట్లాడుతూ కొత్త రిజిస్ట్రేషన్ల కోసం 12, రెన్యువల్ కోసం 8, కాన్సిలేషన్ కోసం 10, మోడిఫికేషన్ కోసం 9 రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. సమావేశంలో ఐటీడీసీ పీడీ ఉమాదేవి, జిల్లా సమాచార పౌర సరఫరాల శాఖ డీడీ అబ్దుల్ రఫీఖ్, వైద్యులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికే స్ఫూర్తిదాయకం తెనాలి సామాజిక సాధికార యాత్ర

- అన్ని కులాలు, మతాలకు భాగస్వామ్యం కల్పించాం
- అందరూ తరలివచ్చి విజయవంతం చేశారు
- ముఖ్యమంత్రి జగనన్న, తనపైనా ప్రేమను చాటుకున్నారు
- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

**తెనాలి:** తెనాలిలో జరిగిన సామాజిక సాధికార యాత్ర రాష్ట్రానికి స్ఫూర్తిగా నిలిచేలా విజయవంతమైందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సంతోషం వ్యక్తంచేశారు. వైఎస్సార్ సీపీ కోస్తాంధ్రలో తొలిసారిగా తెనాలిలో సాధికార యాత్ర ఆరంభించటంతో, రాష్ట్రానికి తగిన స్ఫూర్తిగా ఉండాలని నిర్ణయించామన్నారు. అన్ని కులాలు, మతాలకు భాగస్వామ్యం కల్పించటం ఇందుకు కారణమన్నారు. ఆయా వృత్తులను ప్రతిబింబించేలా బస్సు యాత్ర సాగిందని గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, అగ్రవర్ణాల్లోని పేదలతో సహా తమ జీవన ప్రమాణాలను పెంచినందుకు ఆ వర్గాలంతా హాజరై తనను, ప్రభుత్వాన్ని ఆశీర్వదించినట్టు చెప్పారు. తెనాలిలో సాధికార యాత్ర, బహిరంగసభ సూపర్ సక్సెస్ అయినట్టు తెలిపారు.

స్థానిక గంగానమ్మ పేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి దళితులు, బడుగు, బలహీనవర్గాలు, అగ్రవర్ణాల్లోని పేదలకు ఏ రకంగా సంక్షేమాన్ని, సామాజిక న్యాయాన్ని కల్పిస్తోందీ అందరికీ తెలిసిన విషయమేనని చెప్పారు. ముఖ్యమంత్రి ఆశీర్వాదంతో తెనాలి నియోజకవర్గంలో నూ పేదలందరికీ సంతృప్తి స్థాయిలో సంక్షేమాన్ని అందించినట్టు గుర్తుచేశారు. నామినేటెడ్ పదవుల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు అత్యధిక స్థానం కల్పించామని తెలిపారు. అందుకోసమే ఆయా వర్గాల ప్రజలు వేలాదిగా హాజరై, తనపైనా, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపైనా అభిమానాన్ని చాటారని వివరించారు. హాజరైన ప్రజలకు, సాధికార యాత్ర సక్సెస్ కోసం కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే శివకుమార్ ధన్యవాదాలు తెలియజేశారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏరకంగా సంక్షేమ పథకాలను అందించారు? సామాజిక న్యాయాన్ని ఎలా కల్పించారనే అంశాలపై ఆయా వర్గాల నాయకులు అద్దంకి వేణుగోపాల్, తాడిబోయిన రమేష్, షేక్ దుబాయ్ బాబు, అక్కిదాసు కిరణ్, కొలకలూరి నాగేశ్వరరావు, ప్రసాదం సురేష్, కొడాలి క్రాంతి, కోలా వాసు, షేక్ నాగూర్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు వివరించారు. కృష్ణబలిజ, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, రాష్ట్ర జలవనరుల కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, యాతాటి అనిల్, తోట రఘురాం, కాళిదాసు విజయసత్యం, ప్రసాదం బాల గురవమ్మ, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, కఠారి హరీష్, పినపాటి అనిల్, మర్రిపూడి నరసింహారావు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జి.మహేశ్వరరెడ్డి, వేదికపై మలికార్జునరెడ్డి, వెంకటరమణ

**గుంటూరు ఈస్ట్:** వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.మహేశ్వరరెడ్డి, కార్యదర్శి మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. పలు జిల్లాలకు చెందిన ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్, ఏపీ ట్రాన్స్‌కోకు చెందిన యూనియన్ నాయకులు హాజరయ్యారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులకు ప్రభుత్వం 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ ఏరియర్స్ విడుదల చేయాలని కోరారు. జేఎల్ఎం-2 రెగ్యులర్ ఆర్డర్ ఇచ్చి ఇంక్రిమెంట్లు విడుదల చేయాలని విన్నవించారు. కాంట్రాక్ట్ కార్మికులకు పీఆర్సీ ఏరియర్స్ ఇవ్వాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని చెప్పారు. 1999 నుంచి 2004 వరకు ఉన్న ఉద్యోగులకు ఈపీఎఫ్ నుంచి జీఎఫ్‌కు మార్చాలని కోరారు. ఏపీ జెన్‌కోకు సంబంధించి 2018 నాటికి చంద్రబాబు నాయుడు ఆర్టీపీపీని నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఈ కారణంగా ఉద్యోగులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఆర్టీపీపీని పునః ప్రారంభించి కరోనా నేపథ్యంలో బొగ్గు సంక్షోభం ఉన్నా, మూడు రెట్ల వ్యయంతో బొగ్గునిల్వలు కొని ఉద్యోగులను ఆదుకోవడంతోపాటు, మెరుగైన విద్యుత్ అందించారని గుర్తు చేశారు. సమావేశంలో రాష్ట్ర చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పి.వెంకటరమణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి.బాలాజీ, గుంటూరు జిల్లా రీజనల్ ప్రెసిడెంట్ ఎస్.ఎస్.అలి, రీజనల్ కార్యదర్శి శివరామిరెడ్డి, కిరణ్‌కుమార్, చంద్రశేఖర్, రాజేంద్రకుమార్, పున్నారావు, వై.రామ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# 5జీ ల్యాబ్ స్థాపనకు విజ్ఞాన్స్ ఎంపిక



విజ్ఞాన్‌లో ఆన్‌లైన్‌లో వీక్షిస్తున్న రామకృష్ణ

**చేబ్రోలు:** కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ మినిస్ట్రీ విభాగం నూతన ఆవిష్కరణలు, పరిశోధనలను విస్తృతం చేసేందుకు వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 5జీ ల్యాబ్ స్థాపనకు ఎంపిక చేసిందని భారత ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజ్ఞాన్ యూనివర్సిటీ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ పీ నాగభూషణ్ మాట్లాడుతూ ఢిల్లీలో జరుగుతున్న ఇండియన్ మొబైల్ కాంగ్రెస్-2023 గ్లోబల్ డిజిటల్ ఇన్నోవేషన్ కార్య క్రమంలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజ్ఞాన్ యూనివర్సిటీతో పాటు దేశంలోని వంద యూనివర్సిటీల్లో 5జీ ల్యాబ్స్ స్థాపనకు కృషి చేస్తున్నట్లు ప్రకటించారని వెల్లడించారు. ఆన్‌లైన్ మోడ్ లో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని విద్యార్థు లు విజ్ఞాన్ ఆడిటోరియంలో వీక్షించారు. విజయవాడలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ రూరల్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ రామకృష్ణ పర్యవేక్షించారు. ఇన్నోవేషన్‌లో భాగంగా విద్యార్థుల స్టార్టప్ కమ్యూనిటీస్‌ను మరింత అభివృద్ధి చేసి నేషన్ బిల్డింగ్ కోసం విజ్ఞాన్ యూనివర్సిటీను 5 జీ ల్యాబ్ స్థాపనకు ఎంపిక చేసిందన్నా రు. స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను మరింత అభివృద్ధి చేసి 6జీ టెక్నాలజీకై కృషి చేయాలన్నారు.

# బయో ఫర్టిలైజర్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు

**రూ.7.91 లక్షల విలువైన మందులు స్వాధీనం**



స్వాధీనం చేసుకున్న బయో స్టీమ్‌లెంట్స్

**గుంటూరు రూరల్:** అనుమతులు లేకుండా బయోఫర్టిలైజర్స్ విక్రయిస్తున్న దుకాణాలపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. ఏటుకూరు రోడ్డు బొంతలపాడు డొంకలో అనుమతులు లేకుండా బయో ఉత్పత్తులు తయారు చేసి అమ్ముతూ రైతులను మోసగిస్తున్నారని సమాచారంతో దాడులు నిర్వహించారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో పలు గోదాములు తనిఖీ చేపట్టారు. కోటపాటి కోటేశ్వరరావు, బయో స్టిమ్ లెంట్స్ కెమికల్ పెస్టిసైడ్స్‌తో కలపి వ్యవసాయశాఖ అనుమతులు లేకుండా రా మెటీరియల్ తెచ్చి బయో స్టిమ్ లెంట్స్ తయారు చేయటం గుర్తించారు. అతను తయారు చేసిన బయో స్టిమ్ లెంట్స్ 321 లీటర్ల విలువ రూ.7.91 లక్షలు చేసే స్టీమ్‌లెంట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీహరిరావు, కె.రమణకుమార్ పాల్గొన్నారు.

# రేపటి వరకు ఈ-క్రాప్ సామాజిక తనిఖీ

**కొరిటిపాడు(గుంటూరు):** ఖరీఫ్ ఈ-క్రాప్ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. వంద శాతం ఈ-క్రాప్, 94.99 శాతం ఈ-కేవైసీ పూర్తి చేసిన వ్యవసాయశాఖ... జాబితాలపై ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు నాలుగు రోజులపాటు రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ(సోషల్ ఆడిట్)లు చేపట్టింది. ఎక్కడైనా పొరపాట్లు ఉంటే ఫిర్యాదుల ద్వారా పరిష్కరించనున్నారు. సామాజిక తనిఖీ తర్వాత ఈ నెల 30వ తేదీన తుది ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు తెలిపా రు. ప్రభుత్వ ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, పంట రుణాల సున్నావడ్డీ, మద్దతు ధర ద్వారా పంట ఉత్పత్తుల అమ్మకాలు తదితర కార్యక్రమాలు ద్వారా రైతులకు లబ్ధి చేకూర్చడానికి ఈ-క్రాప్‌ను ప్రామాణికంగా తీసుకుంటు న్న నేపథ్యంలో దీనికి ప్రాధాన్యత నెలకొంది. అందుకోసం అర్హత కలిగిన ఒక్క రైతుకు కూడా అన్యాయం జరగకుండా ఈ ప్రక్రి య పారదర్శకంగా నిర్వహిస్తున్నారు.

# బాధ్యతలు స్వీకరించిన మైనార్టీ సంక్షేమ శాఖాధికారి

**లక్ష్మీపురం:** జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా రోషన్ జమీర్ బాషా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికా రి ఎఫ్ఏసీగా అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్న సువార్త బాధ్యతలను రోషన్ జమీర్ బాషాకు అప్పగించారు. సువార్త యాధావిధిగా జిల్లా విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెంటర్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా వెళ్లారు.